క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌తోనే 'ఖేడ్' అభివృద్ధి



పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: బీఆర్‌ఎస్‌తోనే నారాయణఖేడ్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మూధ రామకృష్ణ, సిర్గాపూర్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్‌రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



దౌల్తాబాద్‌లో యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

హత్నూర(సంగారెడ్డి): యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజు ఎరువుల దుకాణాల వద్ద రైతులు పడిగాపులు కాస్తూ యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. హత్నూర మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు అవసరమున్న యూరియాను సరఫరా చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

ఆదర్శంగా సంక్షేమ పథకాలు



గొర్రెలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రాయికోడ్(అందోల్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రభుత్వ పథకాలు దేశంలోనే ఆదర్శంగా ఉన్నాయని జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్ అన్నారు. మండలంలోని రాయిపల్లి గ్రామంలో గురువారం పలువురు లబ్ధిదారులకు సబ్సిడీ గొర్రెల యూనిట్లను ఎంపీపీ మమత, సర్పంచ్ నర్సమ్మఅడివయ్యలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్ రెడ్డి, సర్పంచ్ నాగార్జున, నాయకులు అడివయ్య, మల్లు పాటిల్, అశోక్, మహరూప్, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



రంజోల్‌లో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, కోహీర్ మండలాల్లో గురువారం ఉద్యానశాఖ రాష్ట్ర సలహాదారులు డాక్టర్ శ్రీనివాస్ పర్యటించి అల్లం, ఆలు పంటలను పరిశీలించారు. కోహీర్, రంజోల్ గ్రామాల రైతులు సంజీవరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, సతీష్ కర్నాటక రాష్ట్రం హసన్ నుంచి తెప్పిచ్చి పండిస్తున్న హిమాలిని, ఏఆర్‌సీ ఆలుగడ్డ రకాలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందచేశారు. ఆయన వెంట ఉద్యాన శాఖ జిల్లా ఏడీఎం సత్తార్, మండల అధికారి అనుషరెడ్డి ఉన్నారు.

రాజశేఖర్‌శర్మకు సన్మానం



రాజశేఖర్‌శర్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇస్రో శాస్త్రవేత్తల బృందంలో ఆర్కిటెక్చర్ ఇంజనీర్‌గా సేవలందించిన రవికాంత్‌శర్మ తండ్రి బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు రాజశేఖర్‌శర్మను గురువారం రాష్ట్ర టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్ 3 శాస్త్రవేత్త బృందంలో ఒకరైన రవికాంత్‌శర్మ తండ్రి రాజశేఖర్‌శర్మ మన మధ్యలో ఉపాధ్యాయుడుగా ఉండడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాపరెడ్డి, విజయ్‌కుమార్, పండరి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు దామోదర్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ ఏర్పాటు అభినందనీయం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- వృద్ధాశ్రమానికి రూ.5లక్షల విరాళం



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: వయోవృద్ధుల సంక్షేమం కోసం వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వాణినగర్‌లో నూతనంగా నిర్మించిన ది నెస్ట్ హోం ఫర్ ది ఏజ్ వృద్ధాశ్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలోని చివరి అంకంలో కుటుంబ సభ్యుల నిరాదరణకు గురై వృద్ధాశ్రమంలో చేరే వృద్ధుల ఆలనా పాలనా చూసేందుకు ఆశ్రమాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నియోజకవర్గ పరిధిలో సొంత నిధులతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆశ్రమం నిర్వహణకు రూ.5లక్షల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, కౌన్సిలర్ కల్పన ఉపేందర్‌రెడ్డి, ప్రముఖ సినీ వ్యాఖ్యాత సుమ పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా డివిజన్ల అభివృద్ధి

బల్దియా పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మాణిక్యప్రభు మందిరం సమీపంలో రూ.26లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆయా వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, బల్దియా అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలోని భారతినగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఇటీవల రూ.22 కోట్ల నిధులను కేటాయించామని గుర్తు చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్ప నగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజనీరింగ్ శాఖ ఈఈ శంకర్ నాయక్, డిప్యూటీ కమిషనర్ సురేష్, అధికారులు పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ

గొల్ల, కురుమల ఆర్థిక స్వావలంభనకు సీఎం కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. రెండవ విడత గొర్రెల పంపిణీలో భాగంగా గురువారం పటాన్‌చెరు మండలం పోచారం గ్రామంలో 12 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షపతి, రాజు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, కార్యదర్శుల మధ్య వార్

- జీపీ భవన నిర్మాణాల స్థల ఎంపికపై నిలదీతతో ముదిరిన వివాదం
- కార్యదర్శుల తీరుతో సభ బహిష్కరణ
- అర్ధాంతరంగా ముగిసిన సర్వసభ్య సమావేశం

వట్‌పల్లి(అందోల్): ఎంపీపీ పత్రి క్రిష్ణవేణి అధ్యక్షతన వట్‌పల్లి రైతువేదిక భవనంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా సాగింది. మండలంలోని భూత్కూర్, షాద్‌నగర్, దరఖాస్తుపల్లి గ్రామాలకు నూతన పంచాయతీ భవనాలు మంజూరయ్యాయని, వాటి నిర్మాణాలకు స్థలాల కేటాయింపు ఏమైందని సదరు కార్యదర్శులను పంచాయతీరాజ్ ఏఈ మొగులయ్య ప్రశ్నించడంతో వార్ మొదలైంది. ఈ క్రమంలో షాద్‌నగర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించిన స్థలం ఎంపికలో సర్పంచ్‌కే ప్రాధాన్యం ఇస్తూ తమ అభిప్రాయాన్ని పట్టించుకోవడంలేదని కార్యదర్శి శ్రీలతను దేవునూరి ఎంపీటీసీ నర్సింహులు సభలో నిలదీయడంతో మిగతా కార్యదర్శిలు సభ పోడియం వద్దకు వచ్చి ఎంపీటీసీని తప్పుపట్టడంతో ప్రజాప్రతినిధులు, కార్యదర్శుల మధ్య వార్ జరిగింది. పల్లె దావాఖానాలలో నియమించిన డాక్టర్లు విధులు నిర్వహించడంలేదని, సరైన మందులు కూడా అందుబాటులో ఉండడంలేదని వైద్యాధికారులను ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు సమయానికి రావడంలేదని, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విధులను ఎగ్గొట్టి రియల్ ఎస్టేట్, ఇతర ఆదాయ దందాలను చేస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఎంఈఓ క్రిష్ణను నిలదీశారు. మహిళా ఎంపీపీ, జెడ్పీటీసీలు ఉన్నా ఒక మహిళా కార్యదర్శిని ఎంపీటీసీ నిలదీసిన తీరుపై ప్రశ్నించకపోవడం సరికాదంటూ తోటి కార్యదర్శులు ప్రశ్నించగా ఎంపీపీ, జెడ్పీటీసీలు కలుగజేసుకుని కార్యదర్శిని ప్రశ్నించడంలో ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ తప్పేముందని, ఏదైనా తప్పుగా మాట్లాడితే చూపించాలనడంతో పాటు కార్యదర్శులకు సభావేదికపైకి వచ్చి మాట్లాడేహక్కు ఎక్కడదని ఆగ్రహించారు. దీంతో ఒక్కసారిగా కార్యదర్శులంతా వచ్చి రైతుబంధు, దళితబంధు లబ్దిదారుల ఎంపికలో తమకు సమాచారం ఇచ్చారా అంటూ ప్రజాప్రతినిధులను ప్రశ్నించడంపై వివాదం మరింత ముదిరింది. స్థానికంగా ఉండకపోవడంతో పాటు విధులు సక్రమంగా నిర్వహించడంలేదని ప్రశ్నిస్తే తప్పుబడతారా అంటూ ప్రజాప్రతినిధులు ఆగ్రహించారు. ఇక నుంచి అందరూ గ్రామాల్లోనే ఉండి విధులు నిర్వహించాలని, లేకుంటే జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేస్తామంటూ ఆగ్రహించారు. సమావేశాన్ని కార్యదర్శిలతోనే నిర్వహించాలని నిరసిస్తూ ఎంపీటీసీలు, సర్పంచులు సభను బహిష్కరించారు. దీంతో మిగతా శాఖల అధికారులు మాట్లాకుండానే సమావేశం అర్ధాంతరంగా ముగిసింది.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

ఎంపీడీఓకు ఫిర్యాదు

అభివృద్ధి పనులపై అధికారులతో కలిసి సర్వసభ్య సమావేశంలో చర్చిస్తుండగా జూనియర్ పంచాయతీ కార్యదర్శిలు సభను అడ్డుకోవడమే కాకుండా సర్పంచులు, ఎంపీటీసీలను ఇష్టానుసారంగా మాట్లాడారని, సమావేశం జరుగుతుండగానే వేదికపైకి వచ్చి ఎంపీపీ వద్ద నుంచి మైకు లాక్కొని సమావేశాన్ని భంగపరిచి సభకు ఆటంకం కలిగించిన పంచాయతీ కార్యదర్శులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

చంద్రయాన్–3 విజయోత్సవ సంబురం



జిన్నారం: బొల్లారంలో బీజేపీ నేతల సంబురాలు



మునిపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): చంద్రయాన్–3 విజయంతో బొల్లారం మున్సిపల్ పరిధిలో గురువారం బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. జైభారత్, జై ఇస్రో అంటూ నినాదాలు చేస్తూ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు అభినందనలు

సదాశివపేట(సంగారెడ్డి): చంద్రయాన్ 3 విజయంపై సత్యసాయి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం సదాశివపేట పట్టణంలో సిద్దాపూర్‌గాని, సుభాష్ రోడ్డు, గాంధీచౌక్, తిలక్ రోడ్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా చేతపట్టి ఇస్రో శాస్త్రవేత్తలను పొగుడుతూ జయహో భారత్ అంటూ విద్యార్థుల నినాదాలు చేశారు. అనంతరం గాంధీచౌక్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి జయమ్మ, పీఈటీ ప్రవీన్‌కుమార్, ఉపాధ్యాయులు సంధ్యరాణి, శ్రీదేవి, రజిత, తబసుమ్ పాల్గొన్నారు.



సదాశివపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సదాశివపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో…

మునిపల్లి(అందోల్): చంద్రయాన్–3 విజయంపై మండలంలోని మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చంద్రాయన్–3 విజయం భారతదేశ కీర్తిప్రతిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిందని విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మొక్కల పంపిణీ



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో 12 వార్డులో గురువారం కౌన్సిలర్ బాలమణి ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరితహారంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ నేడు కిష్టారెడ్డి వర్ధంతి

నారాయణఖేడ్: ఖేడ్ మాజీ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ దివంగత పటోళ్ల కిష్టారెడ్డి 8వ వర్ధంతిని ఈ నెల 25న ఉదయం 11.30గంటలకు నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని మా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్ధంతి సభకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

◆ కొనసాగుతున్న ధర్నా

జహీరాబాద్ టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన ధర్నా గురువారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ వారాంతపు సెలవులు, ఈఎస్ఐ, పీఎఫ్, యూనిఫాం తదితర సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న కార్మికులకు సీఐటీయూ నాయకులు మహిపాల్, మహీంద్ర కార్మిక సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

◆ ప్రభుత్వాస్పత్రికి వీల్‌చైర్ అందజేత



వట్‌పల్లి(అందోల్): అందోల్, జోగిపేట మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు (నాని) జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల సౌకర్యార్థం స్ట్రక్చర్, వీల్‌చైర్ అందజేశారు. అనంతరం రోగులకు పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, అందోల్ నియోజకవర్గం ఆత్మగౌరవ కమిటీ ఉపాధ్యక్షుడు ప్రవీణ్, పట్టణ వాసవి క్లబ్ అధ్యక్షుడు రంగకిషన్ తదితరులు పాల్గొన్నారు.

◆ మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

ఝరాసంగం(జహీరాబాద్): మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్ఐ కృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని కృష్ణాపూర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



నిఖితను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(సీపీజీఈటీ) ఫలితాల్లో సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చక్కని ప్రతిభతో ర్యాంకులు సాధించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన ఎం.నిఖిత ఎమ్మెస్సీ గణితశాస్త్రంలో 56వ ర్యాంకు, నందిని ఎమ్మెస్సీ 991వ ర్యాంకు, జి.మౌనిక రసాయనశాస్త్రంలో 655వ ర్యాంకు, జి.శ్రావణ్‌కుమార్‌కు 477వ ర్యాంకు, డి.ప్రవీణ్ వాణిజ్యశాస్త్రంలో 613వ ర్యాంకు, యాస్మిన్ వృక్షశాస్త్రంలో 450వ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ తాడేపల్లి ప్రతంజలి తెలిపారు. గణితశాస్త్రంలో 56వ ర్యాంకు సాధించిన నిఖితను గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ పతాంజలి, వైస్ ప్రిన్సిపాల్ వినాయకకుమార్ కళాశాల సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు.

'గీతం'లో స్మార్ట్ ఐడియాథాన్ ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: గీతం స్మార్ట్ ఐడియాథాన్ (అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రుద్రారం ప్రాంగణంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. స్టార్టప్ ఇండియా, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్స్ (సీఈఎం), బోస్టన్లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎడ్యుకేషన్ (ఎన్‌ఎయూసీఈఈ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా హైదరాబాద్ ఏంజెల్స్ చైర్మన్ రాజేష్ మంతెన, ఆత్మీయ అతిథిగా కంట్రోల్ ఎస్ క్వాలిటీ– ప్రొక్యూర్మెంట్ హెడ్ చంద్రశేఖర్‌శర్మ గరిమెళ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత జీవితంలో రాణించడానికి ఉపకరించే ప్రాథమిక అంశాలైన ఉత్సుకత, ధైర్యం, శీలం, భావప్రకటనా నైపుణ్యాలపై పట్టు పెంచుకోవాలని వివరించారు. అనంతరం ఉన్నత విద్యా సంస్థలలోని విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగే వాతావరణాన్ని ఎలా సృష్టించాలి? అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సుస్మితసుందర్, వీహబ్ డైరెక్టర్ (వ్యూహం–భాగస్వామ్యం) సృజన చదలవాడ, ఐఎస్‌బీలోని ఐ–వెంచర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ కృష్ణ, ఐటీఐసీ దృవ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేష్ మంతెన

గుమాస్తా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని గ్రీన్ అండ్ సీడ్స్ మార్చంట్ గుమాస్తా సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పట్లోళ మచ్చేందర్, ఉపాధ్యక్షుడిగా కంటాన్ సిద్దేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా గునెల్లి పరుశురాం, జాయింట్ సెక్రటరీగా విఠల్, కోశాధికారిగా ఉల్లిగడ్డ శివాజీ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

'బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం'



మాట్లాడుతున్న రాములు

జహీరాబాద్ టౌన్: బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని బీఆర్‌ఎస్ నుంచి బహిష్కరించబడిన సీనియర్ నాయకులు, ఎంఆర్‌ఎఫ్ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంజీ రాములు అన్నారు. జహీరాబాద్ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ కారణం లేకుండా తనను పార్టీ నుంచి బహిష్కరించడం తనకు మేలు జరిగిందన్నారు. తనను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్న రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావు ఠాక్రేకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హరీశ్‌రావు వందల ఎకరాల్లో కొన్న భూముల వివరాలు తన వద్ద ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు బయటపెడుతానని చెప్పారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఓడించడమే తన లక్ష్యమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంతో యువకుడి ఔదార్యం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళకు అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి రావడంతో నారాయణఖేడ్ బ్లడ్‌డోనర్స్ గ్రూపు సభ్యుడు తన రక్తాన్ని దానం చేసి ఔదార్యం చాటుకున్నాడు. ఖేడ్ ప్రాంతానికి చెందిన మహిళ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమెకు ఓపెన్‌హార్ట్ సర్జరీ నిర్వహించాలని వైద్యులు నిర్ధారించి అత్యవసరంగా బి నెగిటీవ్ గ్రూపు రక్తం అవసరమని తెలిపారు. సంబంధిత గ్రూపు రక్తం అందుబాటులో లేకపోవడంతో రోగి కుటుంబీకులు ఖేడ్ బ్లడ్‌డోనర్స్ గ్రూపు సహకారాన్ని కోరగా సంగారెడ్డిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఖేడ్‌కు చెందిన అదే గ్రూపు రక్తం గల బ్లడ్‌డోనర్స్ గ్రూపు సభ్యుడు అవినాష్‌రావు స్పందించి గురువారం బంజారాహిల్స్‌లోని ఆస్పత్రికి వెళ్లి రక్తాన్ని దానంచేశారు. ఈ సందర్భంగా అవినాష్‌రావుకుకృతజ్ఞతలు తెలిపారు.

భూసమస్యలు పరిష్కరించాలి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నాయకుడు, రైతు ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ మంత్రి హరీశ్‌రావును కోరారు. గురువారం ఆయన కార్యాలయంలో మండలంలోని కాశీంపూర్, చిరాగ్‌పల్లి, సత్వార్, జహీరాబాద్‌కు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 850 ఎకరాలను నిషేధిత జాబితాలో ఉంచారని తెలిపారు. భూ సమస్యలు పరిష్కరించని కారణంగా ఆయా గ్రామాల రైతులకు రైతుబంధు, రైతుబీమా పథకాలు అందడం లేదన్నారు. అధికశాతం మంది ఎస్సీ, బీసీ, మైనార్టీ రైతులు ఉన్నారని చెప్పారు. మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకుని 850 ఎకరాల భూసమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

డాక్యుమెంట్ పోయినది

షేక్ హైదర్ సాబ్ తండ్రి మహమ్మద్ కాశీం సాబ్, వయసు సుమారు 87 సం॥లు, వృత్తి: లేదు, నివాసం: H.No. 3-75, ఝరాసంగం గ్రామం & మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రంకు చెందిన నేను SRO, సదాశివపేట వద్ద నమోదైకాబడిన రెగ్యులర్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.355/1995 క్రింద కొనుగోలు చేసి ఉంది సదాశివపేట టౌన్ & మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సర్వే నం.11/అ లోని 156.00 చ.గజాల విస్తీర్ణం గల నం.6 కలిగిన ఓపెన్ ప్లాట్ యజమాని మరియు స్వాధీనదారుని తెలియజేస్తున్నాను. 16-07-2023న ఆటోరిక్షాలో ఝరాసంగం నుండి జహీరాబాద్ వరకు ప్రయాణించునప్పుడు SRO, సదాశివపేట వద్ద నమోదు కాబడిన లింక్ డాక్యుమెంట్ ఒరిజినల్ రిజిస్టర్డ్ మార్టిగేజ్ డీడ్ నం.211/2006 ను నేను పోగొట్టుకున్నాను/ కనిపించ కుండా పోయింది. నేను దాని గురించి వెతుకగా అది దొరకలేదు. దొరికినవారు ఈ సెల్ నంబరుకు తెలుపగలరు. సెల్ : 9550903158

ఓటరుగా నమోదు చేసుకోవాలి

మునిపల్లి(అందోల్): 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తెన్‌మొళి అన్నారు. గురువారం మునిపల్లి రైతు వేదికలో బుత్ లేవల్ అధికారులతో ఓటర్ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ నమోదుకు ప్రజలు సహకరించాలని సూచించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా, కాలనీ వాసులు జగన్నాథ్‌రెడ్డి, వాసుదేవ్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని వివిధ శాఖల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకుడు అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ 3 ఏళ్ల సర్వీస్ పైబడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు నర్సింహరెడ్డి, హరిప్రియ, గోవింద్, రాజేందర్, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.